కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 15, పచ్చిమిర్చి 50 , బెండ 35, కాకర 50, దొండ 30, దోస 30, ఆలు 30, చామ 50, కీర 30, బీర 60, వంకాయ 30, గోకర 50, బీన్స్ 80, బీట్‌రూట్ 30, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 15, క్యారెట్ 30, చిక్కుడు 60, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (4) 10 , క్యాలీఫ్లవర్ (1) 20, సొరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 150.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్‌ఓసీ పత్రాలను ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ బాధిత కుటుంబానికి మంగళవారం అందజేశారు.శ్రీరాంనగర్ కాలనీ బ్లాక్ ఏకు చెందిన తెలుగుపాటి లక్ష్మికి వైద్య చికిత్స నిమిత్తం లక్షా 75 వేలు మంజూరయ్యాయి. కార్యక్రమంలో స్థానిక నాయకులు బలరాం, కావూరి అనిల్, అష్రాఫ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రేక్ డౌన్..ట్రాఫిక్ జాం



గచ్చిబౌలి జంక్షన్‌లో నిలిచిపోయిన ప్రైవేట్ బస్సు

గచ్చిబౌలి: ప్రైవేట్ బస్సు ప్రధాన కూడలిలో బ్రేక్‌డౌన్ కావడంతో ట్రాఫిక్ జాం నెలకొంది. గచ్చిబౌలి జంక్షన్‌లో మంగళవారం ఉదయం 8.30 గంటలకు శంషాబాద్‌వైపు నుంచి వస్తున్న ఓ ప్రైవేట్ బస్సు జంక్షన్‌లో ఆగిపోయింది. దీన్ని గమనించిన పోలీసులు బస్సు వైపు వాహనాలు రాకుండా స్టాపర్స్ అమర్చారు. ఔటర్ నుంచి కొండాపూర్ వైపు వెళ్లే వాహనాల రాకపోకలకు ఆటంకం కల్గింది. కొద్ది సేపటికి గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీసులు ప్రైవేట్ బస్సును అక్కడి నుంచి తరలించారు.

ఐవీఎఫ్ సెంటర్ ప్రారంభం



సెంటర్‌ను ప్రారంభిస్తున్న తారిక్ అన్సారి తదితరులు

గచ్చిబౌలి: ఇందిరా ఐవీఎఫ్‌ను తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ తారిక్ అన్సారీ, ఫోగ్సీ తెలంగాణ అధ్యక్షురాలు డాక్టర్ శాంతకుమారి ప్రారంభించారు. మంగళవారం గచ్చిబౌలిలోని ఫార్చ్యూన్ సైబర్‌లో ఇందిరా ఐవీఎఫ్‌ను ఏర్పాటు చేశారు. తల్లిదండ్రులుగా మారాలనుకునే జంటలకు ఐవీఎఫ్ ఆధారిత సేవలు అందిస్తామని సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ నితిజ్ ముర్డియా పేర్కొన్నారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్, ఇందిరా ఐవీఎఫ్ సెంటర్ హెడ్ డాక్టర్ తృప్తి గణపతి, గచ్చిబౌలి సెంటర్ హెడ్ డాక్టర్ ఉదయ కిరణ్ బందారు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో ప్లాంటేషన్ డ్రైవ్

రాయదుర్గం: హెచ్‌సీయూలో అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో 'ఎర్త్ డే'ను పురస్కరించుకొని 'ట్రీ ప్లాంటేషన్ డే' కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్షుడు అనిల్‌కుమార్, కార్యదర్శి ఆయుష్‌కుమార్‌ల ఆధ్వర్యంలో సభ్యులు, విద్యార్థులు మొక్కలు నాటారు.

చెస్ పోటీల్లో రాణించిన సంస్కృతి స్కూల్ విద్యార్థులు



విజేతలతో చైర్మన్ లక్ష్మణ్, ఇతరులు

గచ్చిబౌలి: కొండాపూర్ రాఘవేంద్ర కాలనీలోని సంస్కృతి హైస్కూల్‌లో నిర్వహించిన చెస్ చాంపియన్‌షిప్ పోటీలలో పలు స్కూళ్ళ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో సంస్కృతి పాఠశాల విద్యార్థులు ప్రతిభను చాటారు. జూనియర్ విభాగంలో మొదటిస్థానం మణిసాగర్, ఈశ్వర్ ద్వితీయ స్థానం, హరిచందన్, మూడవ స్థానం, శశాంక్‌రాజ్ మొదటి స్థానం, సాత్విక్ ద్వితీయ స్థానం, చైతన్య తృతీయ స్థానంలో నిలిచారు. పాఠశాల చైర్మన్ మంగళారపు లక్ష్మణ్ విజేతలను అభినందించి బహుమతులను ప్రదానం చేశారు.

నేరాలపై అవగాహన, అప్రమత్తత అవసరం

సైబర్ బారిన పడితే వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి

- వేసవి సెలవుల్లో ఊరికి వెళ్లే ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి
- చందానగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్





చందానగర్: ప్రజలకు నేరాలపై అవగాహన, అప్రమత్తంగా ఉంటే నివారించవచ్చని చందానగర్ పోలీస్‌స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. అలాగే వేసవి సెలవులలో ఊరికి వెళ్ళేటప్పుడు ఇళ్లలో బంగారు ఆభరణాలు, నగదు పెట్టవద్దని సూచించారు. యాత్రలు, సొంత ఊర్లకు వెళ్ళేటప్పుడు వాట్సప్ స్టేటస్, ఫేస్‌బుక్‌లో పెట్టవద్దన్నారు. నేడు సైబర్ నేరాలు పెరిగిపోయిన నేపథ్యంలో మీ ఫోన్‌కు లింకులు, ఓటీపీలు వచ్చాయని అపరిచితులు కాల్ చేస్తారని భయపడి చెప్పవద్దని సూచించారు. చందానగర్ డీఐ రవికుమార్ 'సాక్షి'తో మాట్లాడారు. ఆయన మాట్లల్లోనే..

ప్రశ్న: నేడు ఇళ్లలో చోరీలు పెరిగాయి.. దీనిపై..?

డీఐ: చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ధనికులు ఎక్కువగా ఉన్నారు. సాఫ్ట్‌వేర్, వ్యాపార వర్గాలు వాచ్‌మెన్, డ్రైవర్లు, పనిమనుషులను పెట్టుకునే ముందు వారి వివరాలు ఖచ్చితంగా సేకరించాలి. ఆధార్ కార్డుతో పాటు వారిని పరిచయం చేసిన వారి వివరాలు కూడా రాసుకోవాలి. పోలీస్ స్టేషన్‌లో కూడా వారి వివరాలు ఇవ్వాలి. కాగా గత సంవత్సరం ఇళ్లల్లో జరిగిన చోరీలు 102 కాగా సైబర్ కేసులు 119 నమోదయ్యాయి.

ప్రశ్న: చోరీలు జరగకుండా ప్రజలకు మీరిచ్చే సలహాలు ఏమిటి..?

జ: భార్యాభర్తలు ఉద్యోగులైతే.. అలాగే వ్యాపారాలు, పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారు ఇంట్లో విలువైన వస్తువులు ఉంచవద్దు. లాకర్లలో దాచుకోవాలి, లేదా బంధువులను ఇంట్లో ఉంచి వెళ్ళాలి. ఇంటి తాళాలు కూడా ఎక్కడ పడితే అక్కడ పెట్టవద్దు. ఇద్దరి వద్ద రెండు తాళాలు పెట్టుకోవాలి. సెంట్రల్ లాక్ సిస్టమ్‌ను వినియోగించుకోవాలి.

ప్రశ్న: ఓఎల్‌ఎక్స్ మోసాల గురించి..

జ: ఓఎల్‌ఎక్స్‌ను నమ్మొద్దు. యాప్‌లో కొత్త వస్తువులను చూపించి పాత వస్తువులు అమ్ముతారు. సగం డబ్బు ముందే చెల్లించాలని చెబుతారు. తీరా చూస్తే అవి డెలివరీ చేయరు.

ప్రశ్న: సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నారా ?

జ: చందానగర్, నల్లగండ్ల, లింగంపల్లి, ఎంఐజీ తదితర ప్రాంతాలలో ఎక్కువగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఉంటారు. ఈ మధ్య వారు బాధితులుగా మారారు. గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నాం. అపరిచిత వ్యక్తుల నుంచి వస్తున్న కాల్‌లు, గుర్తు తెలియని ఫోన్ నెంబర్ నుంచి వచ్చే లింకులను క్లిక్ చేస్తే బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు నిమిషాల్లో వెళ్లిపోతున్నాయి.

ప్రశ్న: సైబర్ నేరం జరిగినపుడు ఫిర్యాదు ఎలా చేయాలి?

జ: సైబర్ నేరగాళ్ల బారిన పడ్డామని తెలిసిన వెంటనే డయల్ 1930కి కాల్ చేయాలి. సంబంధిత బ్యాంకులకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఏదైనా ఆపద వస్తే డయల్ 100కి ఫోన్ చేయాలి. ఇటీవల ముంబాయి నుంచి సైబర్ నేరగాళ్ళు ఫోన్‌లు చేస్తున్నారు. మీపై నేరారోపణలు ఉన్నాయని, పోలీసులు వచ్చి మిమ్మలను అరెస్ట్ చేస్తారంటూ, బయటపడాలంటే మేము చెప్పినట్టు చేస్తే మిమ్మల్ని ఎవరు అరెస్ట్ చేయరని చెబుతారు. అమౌంట్ కడితే కేసు ఉండదని డబ్బులు లాగుతారు. ఇటువంటి కాల్స్ గురించి ఎవరూ భయపడవద్దు.

ప్రశ్న: చందానగర్ పీఎస్ పరిధిలో ఎన్ని కెమెరాలు ఉన్నాయి?

జ: చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీలలో 984 కెమెరాలు, వివిధ ప్రాంతాలలో ప్రధాన కూడళ్లలో, కాలనీలు, బస్తీలలో 8,840 కెమెరాలు ఉన్నాయి. నేరాలు అదుపునకు ప్రత్యేక సిబ్బందిని నియమించాం. ఎప్పటికప్పుడు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నాం.

ప్రశ్న: మిలటరీ ఉద్యోగినంటూ ఇటీవల జరుగుతున్న మోసాలపై ?

జ: తాను మిలటరీ వ్యక్తినని, ఒక బెటాలియన్‌కు చెందినవాడనంటూ డ్రస్, ఐడీ కార్డు, ట్రైనింగ్ ఫొటోలు చూపించి కారు అమ్మకానికి ఉందని చెబుతారు. ఢిల్లీలో ఉన్నామని చెప్పి డబ్బులు పంపిస్తే ట్రాన్స్‌పోర్టులో పంపిస్తామని నమ్మబలుకుతారు. ఇటువంటి వాటిని నమ్మకూడదు.

ప్రశ్న: యువతకు మీరిచ్చే సందేశం ?

జ: ఇటీవల యువత చెడు అలవాట్లకు దగ్గరవుతున్నారు. గంజాయి, నల్లమందు తీసుకుంటున్నారు. చెడు అలవాట్లతో జీవితం నాశనం చేసుకోవద్దు. యువత, ప్రజలు పోలీసులకు సహకరించాలి.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే గాంధీ సూచించారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్, వివేకానందనగర్, కూకట్‌పల్లి పార్టు డివిజన్‌లో నెలకొన్న సమస్యలు, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై జీహెచ్‌యంసి ఇంజనీరింగ్ విభాగం, జలమండలి అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జీహెచ్‌యంసీ, జలమండలి ప్రభుత్వ శాఖల పనితీరును సమీక్షించారు. ప్రజలకు అందుబాటులో ఉండడంతో బాటు సమస్యలపై నిర్లిప్తతను వీడాలని, మీ దృష్టికి వచ్చిన సమస్యలపై స్పందించాలన్నారు. అధికారులు రోడ్డు కటింగ్ సమయంలోనూ, మంచినీటి పైపులైన్, డ్రైనేజీ పైపులైన్‌లు వేసేటప్పుడు తవ్విన రోడ్డును వెంటనే మరమ్మతులు చేయాలని, యూజీడీ, రోడ్ల పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. రోడ్ల పనుల్లో వేగం పెంచాలన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని నీటి ఎద్దడి రాకుండా చూడాలని, స్వచ్ఛమైన తాగునీరును అందించాలన్నారు. జీహెచ్‌యంసి జలమండలి అధికారులు డిజిఎం నాగప్రియ, మేనేజర్లు ప్రియాంక, యూన్స్, ఇంజనీరింగ్ అధికారులు ఏఈలు రాజీవ్, నిఖిల్, శ్రావణి, సాయి ప్రసన్న పాల్గొన్నారు.

ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ మళ్లింపు

గచ్చిబౌలి: రోడ్డు విస్తరణ కారణంగా ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ గజరావు భూపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీసీ కోహినూర్ నుంచి నాలెడ్జి సిటీ వరకు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న కారణంగా బుధవారం ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని ఆయన కోరారు. ఐల్యాబ్స్ నుంచి ఐకియా రోటరీ వైపు వెళ్లే వాహనాలు ఐటీసీ కోహినూర్ వద్ద ఫ్రీ లెఫ్ట్ తీసుకొని ఆర్‌ఎంజడ్ మీదుగా నాలెడ్జి సిటీ రోడ్ నెంబర్ 8 వద్ద లెఫ్ట్ తీసుకొని మై హోం అబ్రా నుంచి ఐకియా ఫ్లైఓవర్, రోటరీకి వెళ్లాలన్నారు. కేబుల్ బ్రిడ్జి నుంచి టీ హబ్ వైపు వచ్చే వాహనాలు ఐటీసీ కోహినూర్, మై హోం అబ్రా జంక్షన్ నుంచి నేరుగా వెళ్లి సీ గేట్ వద్ద ఎడమ వైపు తిరిగి టీ హబ్‌కు చేరుకోవాలన్నారు. నాలెడ్జీ సిటీ రోడ్డు నుంచి మై హోం అబ్రా జంక్షన్ వైపు మాత్రమే వాహనాలను అనుమతిస్తారని, నాలెడ్జి సిటీ వైపు అనుమతించరని ఆయన తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

సీఆర్ ఫౌండేషన్‌కు ఎస్‌బీహెచ్ స్టాఫ్ అసోసియేషన్ వెల్ఫేర్ ట్రస్ట్ చేయూత



కోల్డ్ రూమ్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌బీహెచ్ స్టాఫ్ అసోసియేషన్ వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యులు

చందానగర్: కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్‌లోని హోమ్ ఫర్ ఏజ్డ్‌లోని వంటగదిలో కోల్డ్ రూమ్‌ను ఎస్‌బీహెచ్ స్టాఫ్ అసోసియేషన్ మేనేజింగ్ ట్రస్టీ శైలేంద్ర లిమాయే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లకు వంటకాలను తాజాగా తయారు చేయడానికి సుమారు రూ.3.25 లక్షలతో కోల్డ్ రూమ్‌ను నిర్మించడం జరిగిందన్నారు. వృద్ధులకు సౌకర్యవంతమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడంలో సీఆర్ ఫౌండేషన్ చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం సీఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి ట్రస్టీలను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆపరేటివ్ ట్రస్టీ ఆర్.శ్రీకాంత్‌రెడ్డి, నరహరి, వైఎస్ నాగిరెడ్డి, ఆంధ్రాబ్యాంకు మాజీ డైరెక్టర్ బిఎస్‌ఆర్ మోహన్‌రెడ్డి, సీఆర్ ఫౌండేషన్ కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు, ట్రెజరర్ చెన్నకేవశరావు, ఉపాధ్యక్షులు కంభంపాటి అజయ్ కుమార్, వృద్ధాశ్రమ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి.. టెక్నాలజీ వాడాలి



ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటిన డాక్టర్ శరత్‌రెడ్డి తదితరులు

మాదాపూర్: భూమిని కాపాడే ప్రయత్నం చిన్నపాటి నిబద్ధతతో మొదలవుతుందని మెడికవర్ హాస్పిటల్స్ ఇండియా క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ శరత్ రెడ్డి తెలిపారు. మంగళవారం మాదాపూర్‌లోని మెడికవర్ ఆసుపత్రి ఆవరణలో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం, టెక్నాలజీని వినియోగించడం ద్వారా ఆరోగ్యవంతమైన భూమిని, సమాజాన్ని నిర్మించుకోవచ్చన్నారు. గ్రీన్ ఇండియా ఫౌండర్ సంతోష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు హరిత భవిష్యత్తు కోసం మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో గ్రీన్ ఇండియా రాష్ట్ర ఇంచార్జ్ సతీష్, సిద్దిపేట ఇంచార్జ్ రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల కోసమే 'డిజైన్ సింక్'

ఎఫ్‌డీడీఐ హైదరాబాద్ డైరెక్టర్ డా.తేజ్‌లోహిత్‌రెడ్డి



కళాకారులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎఫ్‌డీడీఐ ఈడీ తేజ్‌లోహిత్‌రెడ్డి

రాయదుర్గం: కళాకారులను ప్రోత్సహించాలనే సంకల్పంతోనే 'డిజైన్ సింక్'కు రూపకల్పన చేసినట్లు ఎఫ్‌డీడీఐ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ నర్సింహగారి తేజ్‌లోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాయదుర్గంలోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో పోచంపల్లి చేనేత కారులు నర్సింహ, న్యాచురల్ డైయింగ్ కళాకారుడు దుద్యాల శంకర్ ఏర్పాటు చేసిన స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెరియాల్ పెయింటింగ్, బనానా ఫైబర్ వీవింగ్, బాతిక్ డైయింగ్, సిల్వర్ ఫిలిగ్రీ, ఏటికొప్పాక బొమ్మలు, కొల్హాపురి చెప్పల్, పోచంపల్లి కళాకారులతో స్టాళ్లు ఏర్పాటు చేయించామన్నారు. ఈనెల 25 వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందన్నారు. అనంతరం కళాకారులకు సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు, సందర్శకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



రాయదుర్గం: సాయిఐశ్వర్య కాలనీలోని షిర్డీ సాయి బాబా ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, అలంకారం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

కట్టమైసమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవం

ఎన్టీఆర్‌నగర్‌లోని కోమటికుంట కట్టమైసమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవంను ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

క్రీడలు ఐకమత్యాన్ని చాటుతాయి

'ఎస్కీ' డైరెక్టర్ డా.రామేశ్వరరావు



విజేతలతో డైరెక్టర్ రామేశ్వరరావు, ఫ్యాకల్టీ ప్రతినిధులు, అధికారులు

రాయదుర్గం: చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు అన్నారు. గచ్చిబౌలిలోని 'ఎస్కీ' క్యాంపస్‌లో పీజీ విద్యార్థులకు నాలుగు రోజులుగా నిర్వహించిన క్రీడాకౌశలం పోటీల ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతులు, ట్రోఫీలు, సర్టిఫికెట్లను అందించారు. హెచ్‌సీయూ ప్లేస్‌మెంట్ గైడెన్స్ అండ అడ్వైజరీ బ్యూరో చైర్మన్ ప్రొఫెసర్ చరణ్ శ్రీవాత్సవ మాట్లాడుతూ భూమి తల్లిలాంటిదని, భూమిని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో రెరా చైర్మన్ మాజీ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ కమిషనర్ డాక్టర్ సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె అశోక్, ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెమీకండక్టర్ ప్రోగ్రామ్‌కు 'బెస్ట్ కన్సీవ్డ్ కోహర్ట్' అవార్డు

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని ఏఐసీ టీ హబ్‌లోని సెమీకండక్టర్ ప్రోగ్రామ్.. ఇటీవల నిర్వహించిన స్టార్టప్ మహాకుంభ్-2025లో 'బెస్ట్ కన్సీవ్డ్ కోహర్ట్-2025 అవార్డును సాధించింది. మంగళవారం రాత్రి దీనికి సంబంధించిన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచిన స్టార్టప్ ఇంక్యుబేటర్ టీహబ్ అటల్ ఇన్నోవేషన్ మిషన్(ఏఐఎం) భాగస్వామ్యంలో రూపొందించిన ఏఐసీ టీహబ్ సెమీకండక్టర్ ప్రోగ్రామ్‌కు ఈ అవార్డు లభించడం విశేషం. ఈ సందర్భంగా ఏఐసీ టీహబ్ ఫౌండేషన్ సీఈఓ రాజేష్ అడ్లా మాట్లాడుతూ బెస్ట్ కన్సీవ్డ్ కోహర్ట్-2025 అవార్డును గెలుచుకోవడం గర్వకారణమన్నారు. ఇది మా డీప్‌టెక్ దృష్టి, వ్యూహాత్మక కార్యాచరణకు ఉన్న నిబద్ధతకు గుర్తింపుగా నిలిచిందన్నారు.

14 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.... సోమవారం నిర్వహించిన డ్రైవ్‌లో 14 మందిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహనదారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఏడుగురికి రూ.1500 జరిమానా, నలుగురికి రూ.2 వేలు, మరో ముగ్గురికి రూ. వెయ్యి రూపాయల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ఇంటర్‌లో గురుకుల బాలికల సత్తా



లక్ష్మీప్రణతి, బైపీసీ 438/440



భవ్యశ్రీ, బైపీసీ 438/440



షేక్ ఆసిఫా, ఎంపీసీ 991/1000



హిమబిందు, బైపీసీ 991/1000



శ్రీవల్లి, బైపీసీ 990/1000

రాయదుర్గం: ఇంటర్మీడియట్ ఫలితాలలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాల గౌలిదొడ్డి బాలికలు సత్తా చాటారు. ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీలో 438/440 మార్కులను జే లక్ష్మీప్రణతి, పి భవ్యశ్రీలకు లభించగా.జి శ్రీజ 437/440, ఎంపీసీలో టి శ్రద్ధ ఆర్య 467/470, హాసిని 466/470, డి అక్షయ 466/470, పి స్నిగ్ధ 466/470, ఉమ 466/470, ఎంఈసీలో జే అపర్ణ 492/500, డి పవిత్ర 491/500 మార్కులు సాధించారు. ఫస్ట్ ఇయర్‌లో కళాశాల టాపర్లుగా లక్ష్మీప్రణతి, భవ్యశ్రీలు నిలిచారు.

ద్వితీయ సంవత్సరం ఫలితాలు..

ఇంటర్మీడియట్ సెకెండ్ ఇయర్ ఎంపీసీలో ఆసిఫా 991/1000, భవ్యశ్రీ 988/1000 అత్యధిక మార్కులు సాధించారు.బైపీసీలో హిమబిందు 991/1000, సిరివెన్నెల 990/1000, అత్యధిక మార్కులు సాధించారు. ఎంఈసీలో వి.స్వాతి 985/1000, కె సాత్విక 984/1000 అత్యధిక మార్కులు సాధించారు. కళాశాలలో ఆసిఫా, భవ్యశ్రీ టాపర్లుగా మొదటి స్థానంలో నిలిచారు. ఇంటర్‌లో మంచి ఫలితాలు సాధించడం పట్ల గురుకుల సంస్థ కార్యదర్శి అలుగు వర్షిణి, అదనపు కార్యదర్శి సంతోషి, అకడమిక్ సంయుక్త కార్యదర్శి సక్రు నాయక్, ఓఎస్‌డీ వివేకానంద, స్టేట్ ఆఫీసర్ భీమయ్యలు విద్యార్థులను, అధ్యాపకబృందాన్ని అభినందించారు.

గౌలిదొడ్డి గురుకుల బాలుర విజయకేతనం

ఇంటర్మీడియట్ ఫలితాలలో గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. మంగళవారం కళాశాల ప్రిన్సిపల్ వెంకటచలపతి, వైస్ ప్రిన్సిపల్ గణేష్ వివరాలను వెల్లడించారు. పరీక్షలకు హాజరైన 425 మందిలో 416 మంది విద్యార్థులు 'ఏ' గ్రేడ్‌లో ఉత్తీర్ణులయ్యారు.



సాత్విక్, బైపీసీ 992/1000



మూర్తి, బైపీసీ 991/1000



గాలీబ్ ,ఎంపీసీ 985/1000



రాజశేఖర్, ఎంపీసీ 985/1000



అదీప్ ఎంపీసీ 466/470



అక్షయ్ ఎంపీసీ 467/470



శ్రీహరి, బైపీసీ 437/440



శ్రీకర్, ఎంపీసీ 467/470

త్వరలో అమీన్‌పూర్‌కు నవోదయ స్కూల్

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



ఎమ్మెల్యేకు ప్లాన్ గురించి వివరిస్తున్న అధికారులు

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గంలోని పేద, మధ్యతరగతి విద్యార్థులకు అత్యాధునిక వసతులతో కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలన్న లక్ష్యంతో నవోదయ విద్యాలయం మరియు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ గోశాల సమీపంలో గల ప్రభుత్వ సర్వే నంబర్ 993లో విద్యాసంస్థల ఏర్పాటు కోసం స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే నవోదయ విద్యాలయాన్ని అమీన్‌పూర్‌లో ఏర్పాటు చేయనున్నారని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కోసం సైతం స్థల పరిశీలన చేసినట్లు తెలిపారు. నవోదయ విద్యాలయం కోసం 20 ఎకరాలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కోసం 20 ఎకరాలు, మినీ స్టేడియం కోసం 5 ఎకరాలు కేటాయించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపనున్నట్లు తెలిపారు. మినీ స్టేడియం పనులను సైతం అతి త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. తహసీల్దార్ వెంకటస్వామి, మాజీ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహగౌడ్, ఆర్ఐ రఘునాథ్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

భార్య, అత్తపై అల్లుడి దాడి

- కత్తితో పొడవడంతో తీవ్ర గాయాలు
- పోలీసుల అదుపులో నిందితుడు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీదేవి

మియాపూర్: భార్యా భర్తల మధ్య ఏర్పడిన వివాదం దాడికి దారి తీసింది. భార్యపై భర్త కత్తితో దాడి చేయగా..అడ్డుగా వచ్చిన అత్తను సైతం కత్తితో పొడవడంతో తీవ్రంగా గాయపడింది. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘటన వివరాలు..సీఐ క్రాంతి కుమార్ తెలిపిన ప్రకారం..కాకినాడకు చెందిన బండారులంక మహేష్ మియాపూర్ జనప్రియనగర్ రోడ్డు నెం.5 శ్రీ వెంకట నిలయంలో భార్య శ్రీదేవి, రెండేళ్ల కుమార్తెతో కలిసి ఉంటూ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గత కొంతకాలంగా మహేష్ తన సంపాదనను ఇంటి ఖర్చులకు ఇవ్వకుండా..మద్యం తాగేందుకు ఖర్చుచేస్తున్నాడు. ఈ విషయంలో భార్య శ్రీదేవితో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం శ్రీదేవి చందానగర్ హుడాకాలనీలో ఉంటున్న తల్లి మంగ ఇంటికి వెళ్లింది. సోమవారం మధ్యాహ్నం శ్రీదేవికి ఫోన్‌చేసి ఇంటికి తిరిగి రమ్మని మహేష్ కోరగా..ఆమె మధ్యాహ్నం ఒంటి గంటకు కుమార్తెతో కలిసి వచ్చింది. అదేరోజు సాయంత్రం మహేష్ తన సోదరుడు సాయికుమార్ పుట్టిన రోజు ఉందని, జనప్రియ కాలనీలో ఉంటున్న తమ తల్లిదండ్రుల ఇంటికి వెళ్దామని చెప్పాడు. దీనికి శ్రీదేవి నిరాకరించడంతో ఆమెను తీవ్రంగా కొట్టాడు. ఈ విషయాన్ని శ్రీదేవి తల్లి మంగకు ఫోన్ చేసి చెప్పగా ఆమెకూడా ఇక్కడికి వచ్చింది. దాడిని ప్రశ్నించడంతో ఆవేశానికి లోనైన మహేష్ వంటగదిలోకి వెళ్లి కూరగాయలు కోసే కత్తి తీసుకుని వచ్చి మొదట శ్రీదేవిపై దాడి చేశాడు. వారించేందుకు వెళ్లిన అత్త మంగను విచక్షణారహితంగా కత్తితో పొడవడంతో ఆమె తీవ్రంగా గాయపడగా..స్థానికులు గమనించి ఇద్దర్నీ సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై శ్రీదేవి భర్త మహేష్‌పై మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నిందితుడు మహేష్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.